జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 17-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 371 పేజీలు: 4 వెల : రూ.7

# ఉదయం రెక్కీ.. రాత్రి చోరీ!





* తాళం వేసివున్న ఇళ్లే.. వారి టార్గెట్ * శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, నిఘా లేకపోవడంతో పెరుగుతున్న చోరీలు * నరసన్నపేటలో రెండిళ్లలో దొంగతనం * 2 కిలోల వెండి, 7 తులాల బంగారు ఆభరణాలు చోరీ * హడలిపోతున్న శివారు ప్రాంతాల ప్రజలు

**శ్రీకాకుళం క్రైం, జూన్ 16 (వార్త):** జిల్లాలో ఇటీవల చోరీలు అధికమయ్యాయి. ఉదయం పూట రెక్కీ వేసి.. రాత్రిపూట దొంగతనాలు పాల్పడుతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి మరీ చోరీకి అగంతకులు పాల్పడుతున్నారు. శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, పోలీసుల నిఘా తక్కువగా ఉండడంతో దొంగలు తమ చోరకళను ప్రదర్శిస్తున్నారు. దీంతో శివారు ప్రాంత ప్రజలు ఇంటికి తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు హడలిపోతున్నారు. నరసన్నపేట పట్టణంలో ఆదివారం రాత్రి ఏకంగా రెండిళ్లలో చోరీ జరిగింది. రిటైర్డు ఉపాధ్యాయుడు దుంగ రామారావు విశాఖపట్నంలో ఉంటున్నారు. ఆయన ఇళ్లకు తాళం వేసి ఉండడాన్ని గమనించిన అగంతకులు ఆదివారం రాత్రి ఆయన ఇంట్లోని 44 తులాల వెండి, మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.35వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే మరో ప్రభుత్వ ఉద్యోగి గనగళ్ల రాంబాబు పదిరోజులు కిందట ఇంటికి తాళం వేసి వేరే ప్రాంతానికి వెళ్లాడు. దొంగలు అతని ఇంట్లో చొరబడి నాలుగు తులాల బంగారు నగలు, కిలో వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. ఆ రెండిళ్లలో తాళాలు పగులగొట్టి ఉన్న విషయాన్ని గమనించిన స్థానికులు వారికి సమాచారం అందించారు. దీంతో ఆ రెండు కుటుంబాలు వారు హుటాహుటిన ఇంటికి చేరుకొని చూడగా చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఈ రెండిళ్లలో విచారణ చేపట్టారు. ఇంటిలోపల, బయట సాక్ష్యాలు, వేలిముద్రల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



# మహిళ.. మర్డర్



* ఇటీవల మిస్సింగ్ కేసు నమోదు * అంతలోనే అనుమానాస్పదంగా జీడితోటలో మృతదేహం * దర్యాప్తు చేస్తున్న పోలీసులు * కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు

**మందస, జూన్ 16(వార్త):** మందస మండలంలోని పిడిమందస గ్రామానికి చెందిన ముంజేటి రాజేశ్వరి(24) అనుమానస్పదంగా ఉద్దానం జీడితోటల్లో మరణించింది. ఐదు రోజుల క్రితం పిడిమందస నుంచి పాలవలస గ్రామానికి బయలుదేరిన రాజేశ్వరి శవమై కనిపించడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి. పిడిమందస గ్రామానికి చెందిన ముంజేటి రాజేశ్వరికి సోంపేట మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన గోకర్ల చంద్రశేఖర్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరిద్దకి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చంద్రశేఖర్ ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నాడు. ఇటీవల రాజేశ్వరి పుట్టింటికి వచ్చింది. ఈ నెల 11న తిరిగి పాలవలస వెళ్ళడానికి బయలుదేరింది. హరిపురం వరకు ఆమె బంధువులు తీసుకెళ్ళి, పాలవలస బస్సు కూడా ఎక్కించారు. అయితే ఆమె పాలవలస చేరుకోలేదు. దీంతో రాజేశ్వరి కుటుంబీకులు మందస పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు కూడా చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ తరుణంలో మందస-సోంపేట సరిహద్దు జీడితోటల్లో మృతదేహం అనే సమాచారం గుప్పుమంది. సోంపేట మండలంలోని ఎర్రముక్కాం ప్రాంతంలో మృతదేహం లభ్యమయ్యింది. ఒకానొక దశలో బారువా పీఎస్ పరిధి లోకి కేసు వస్తుందని అనుకున్నారు. కానీ సోంపేట మండలంలోని మృతదేహం పడిఉన్న తోటలు మందస మండలం పరిధిలోకి వస్తుండడంతో కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ ఎం.తిరుమలరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, దర్యాప్తు ప్రారంభించారు. శ్రీకాకుళం నుంచి క్లూస్ టీమ్ వచ్చి పరిశీలన జరిపింది. శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మందస మండలంలోని హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేశ్వరిది హత్యా, లేక ఇంకేమైనా జరిగిందా అనే వివరాలు పోస్ట్ మార్టం అనంతరం తెలియజేస్తామని పోలీసులు చెప్పారు. మృతదేహం పడిఉన్న తీరును చూస్తే, ఆమె హత్యకు గురయ్యిందనడానికి అనుమానాలు బలంగా కనిపిస్తున్నాయి.



# శ్రీకూర్మంలో.. యోగాంధ్ర

* వ్యసనాల నివారణకు యోగా ఒక మార్గం * పాశ్చాత్య దేశాల్లో ఇది నిత్య చర్య * మన సంప్రదాయాన్ని మనం పాటించకపోవడం దురదృష్టకరం * ఎమ్మెల్యే గొండు శంకర్



2లో

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కూర్మ గ్రామాన్ని సందర్శించిన కొరికాన

**హిరమండలం/కొత్తూరు, జూన్ 16 (వార్త):** అధ్యాత్మిక గ్రామం కూర్మ గ్రామాన్ని జనసేన నాయకుడు కొరికాన రవికుమార్ అనుచరు లతో కలిసి సోమవారం సందర్శించారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కూర్మ గ్రామం పునర్నిర్మాణానికి జనసేన అండగా ఉంటుందని చెప్పారు.



# శ్రీకూర్మంలో.. యోగాంధ్ర

* వ్యసనాల నివారణకు యోగా ఒక మార్గం * పాశ్చాత్య దేశాల్లో ఇది నిత్య చర్య * మన సంప్రదాయాన్ని మనం పాటించకపోవడం దురదృష్టకరం * ఎమ్మెల్యే గొండు శంకర్

**శ్రీకూర్మం, జూన్ 16 (వార్త):** శ్రీకూర్మం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాల్లో యోగా నిర్వహించడం అనేది ఒక యజ్ఞంతో సమానమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సోమవారం శ్రీకూర్మంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలతో కలిసి ఎమ్మెల్యే యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యోగా మన పురాతన సంప్రదాయంగా ఉన్నప్పటికీ దాన్ని అందరూ ఆచరించకపోవడం దురదృష్టకరమన్నారు. పాశ్చాత్య దేశాలు యోగాను నిత్యచర్యగా స్వీకరించాయని గుర్తుచేశారు. శరీరం, శ్వాస, మనసు మూడింటినీ అనుసంధానించే శక్తి యోగాలో ఉందన్నారు. మానసిక, శారీరక ప్రశాంతత యోగ వల్ల లభిస్తుందని, సమాజాన్ని క్రమశిక్షణతో ముందుకు నడిపించవచ్చని వివరించారు. పిల్లలు చెడు వ్యసనాల బారిన పడకుండా ఉండాలంటే యోగా మంచి మార్గమని చెప్పారు. యోగాను ప్రజలకు పరిచయం చేయడం లక్ష్యంగా నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రస్తుతం స్థానిక 80 అడుగుల రహదారిలో ప్రతిరోజూ అనుభవజ్ఞులైన శిక్షకులతో యోగా శిక్షణ



అందిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న భారీ యోగాంధ్ర కార్యక్రమానికి ప్రజలతో పాటు అన్ని శాఖల అధికారులు సన్నద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. యోగా గురువు పాండ్రంకి మురళీకృష్ణ పర్యవేక్షణలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, టూరిజం అధికారి నారాయణరావు, డిడబ్ల్యూఎంఏ పిడి సుధాకర రావు, ఆయుష్ అధికారి డా.పి.జగదీష్, డా.ఉత్తమ్ రాజ్ రాణా, జె.శేఖరరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ వై ఎస్ ఎఫ్ ఉపాధ్యక్షులు కొంక్యాన మురళీ, సర్పంచ్ గోరు అనిత, మాజీ సర్పంచ్ కోరాడ వెంకటరావు, మాజీ ఎంపీటీసీ కైబాడ రాజు, మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, పెద్ద సంఖ్యలో శ్రీకూర్మం పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.



## రామాలయంలో యోగా

**కొత్తూరు, జూన్ 16 (వార్త):** కొత్తూరు మండల కేంద్రంలోని రామాలయం ప్రాంగ ణంలో లోతుగడ్డ ఇందిర రామ్ ఆధ్వర్యంలో సోమ వారం 100 మందిచే యోగా కార్యక్రమాన్ని నిర్వహిం చారు. గేదెల మన్మధరావు యువకులతో యోగా సనాలు వేయించారు. ఈ సందర్భంగా ఇందిర రామ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేస్తే ఎటువంటి వ్యాధులు దరిచేరవన్నారు. లోతుగెడ్డ లక్ష్మీ నారాయణ నాయుడు మాట్లాడుతూ యువకులతో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో పున్నగిరి మాస్టారు, పడాల వెంకట క్రిష్ణ, లోతుగెడ్డ ఆనంద్, ఆంజనేయులు, జనార్ధన, యువకులు పాల్గొన్నారు.






## వచ్చేనెల 31 వరకూ డయేరియా నివారణ కార్యక్రమాలు

**శ్రీకాకుళం, జూన్ 16 (వార్త):** వచ్చేఏఎల 31 వరకూ జిల్లాలో డయేరియా నివారణ కార్యక్రమాలు నిర్వహిస్తామని డీఎంహెచ్వో డాక్టర్ కె.అనిత తెలిపారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియారహిత సమాజాన్ని సాధించుటకు కృషి చేయాలన్నారు. ఈ నెల 16 నుండి జూలై 31వరకు ఇంప్లిమెంటేషన్ పేజ్-2లో భాగంగా డయేరియా నివారణ కార్యక్రమాలను నిర్వహించాలని, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అతిసార వ్యాధి నుండి చిన్నపిల్లలను కాపాడుటకు తగు జాగ్రత్తలను తీసుకోవాలని, చేతులను తరచూ శుభ్రపరచుకోవాలని, సురక్షితమైన తాగునీటిని ఉపయోగించాలని, పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బిడ్డపుట్టిన మొదటి ఆరునెలలు కేవలం తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని, తదుపరి అనుబంధ ఆహారంతో కూడిన పోషకాహారం ఇవ్వాలని, బిడ్డకు రోటావైరస్, తట్టు టీకాలు వేయిం చాలని, చిన్నపిల్లలో అతిసార వ్యాధి సంభవిస్తే, వైద్యుల సలహా మేరకు తక్ష ణమే, ఓ. ఆర్.ఎస్ ద్రావణం మరియు జింక్ మాత్రలను ఇవ్వాలని సూచిం చారు. గ్రామస్థాయిలో ఆరోగ్య కార్యకర్త, ఆశాలు, గృహసందర్శనలు చేసి నప్పుడు, ఓఆర్ఎస్ ద్రావణం కలుపు విధానాన్ని తల్లితండ్రులకు చెప్పాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. రామ్, డిప్యూటి డిఎమ్‌హెచ్ఓ మేరీ కేథరిన్, డా. వెంకటలక్ష్మి, ఎస్ఓ రామనాగేశ్వరరావు, సూపరింటెండెంట్ డి.భాస్కరకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన ఎస్‌పీఎల్ పోటీలు



**శ్రీకాకుళం, జూన్ 16 (వార్త):** ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో నిర్వహించే మాదిరిగానే ఈ ఏడాది సైతం సింగుపురం యూత్, గ్రామ ప్రజల సహకారంతో ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. గత నెల రోజుల నుంచి క్రికెట్ పోటీలు జరుగగా ఆదివారంతో ఎస్‌పీఎల్ పోటీలు ముగిసాయి. సింగుపురం, మునసబుపేట క్రికెట్ జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. సింగుపురం క్రికెట్ జట్టు ఘన విజయం సాధించింది. ఈ పోటీల్లో గెలుపొందిన సింగుపురం క్రీడాకారులకు క్రికెట్ ట్రోఫీతోపాటు నగదు పురస్కారం రూ 20వేలు సాధించుకున్నారు మేన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఆదిరెడ్డి హరికృష్ణ నిలిచారు. ఈ నగదు పురస్కారంతో పాటు ఈ ట్రోఫీని సింగుపురం గ్రామానికి చెందిన వ్యాపార వేత్త కొండలరావుతోపాటు జనసేన నాయకులు సింహాద్రి నాగేష్‌లు అందజేశారు.

## రిమ్స్ అన్నపూర్ణకు 20వేలు వితరణ

**శ్రీకాకుళం, జూన్ 16 (వార్త):** శ్రీ సత్యసాయి సేవా సంస్థలు రిమ్స్‌లోగల రోగుల సహాయకులకు నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథ కానికి శ్రీకాకుళం పట్టణం బ్యాంకర్స్ కాలనీకి చెం దిన రిటైర్డు ప్రధానోపాధ్యాయులు ఉప్పు దామో దరరావు వారి కుమారులు సాయి నీల్, సాయి శ్రావణ్‌ల పుట్టినరోజు సందర్భంగా రూ.20వేలను రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ అధ్యక్షులు గంగుల రమణ బాబుకు సోమవారం అందజేశా రని సూర రామచంద్రరావు తెలిపారు. ఈ కార్య క్రమంలో ట్రస్ట్ సభ్యులు సత్య జ్యువెలర్స్ కృష్ణారావు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పల్లా కుటుంబానికి పరామర్శ

**పలాస, జూన్ 16 (వార్త):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక నియోజకవర్గ శాసన సభ్యులు పల్లా శ్రీనివాస్ తండ్రి మాజీ శాసన సభ్యులు పల్లా సింహాచలం కొద్దీ రోజులు క్రితం తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం జిల్లా చెందిన యాదవ సంఘ సభ్యులు సోమవారం పల్లా శ్రీనివాస్‌ను పరామర్శించారు.

## బాలుడు ఆత్మహత్యాయత్నం

**మందస, జూన్ 16(వార్త):** మందస పట్టణంలోని రెల్లివీధికి చెందిన 14ఏళ్ల బాలుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విశాఖపట్నం నుంచి మందసకు వచ్చిన ఈ బాలుడు ఆత్మహత్యానికి పాల్పడడానికి కారణాలు తెలియడంలేదు. వివరాలిలా ఉన్నాయి. ఆ బాలుడి కుటుంబీకులు మందస నుంచి విశాఖపట్నం ఉపాధి కోసం వెళ్లిపోయారు. రక్త సంబంధీకుల ఇంటికి వచ్చిన 9వ తరగతి చదువుతున్న బాలుడు ఇంటిలో తలుపులు వేసుకున్నాడు. బంధువులు ఎంత పిలిచినా.. తలుపులు తీయకపోవడంతో బలవంతంగా తలుపులు తెరిచి చూసేసరికి ఉరికి వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సాయంతో కిందకు దించి, 108కు సమాచారం అందించారు. పరిస్థితి విషయంగా ఉండడంతో ఆయన చిన్నాన్న ద్విచక్రవాహనంపై హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలిస్తున్న సమయంలో బాలిగాం వద్ద 108 వాహనం కనిపించడంతో ఆ వాహనంలోకి ఎక్కించి, హరిపురం ఆసుపత్రికి తరలించారు. పవన్ పరిస్థితిని చూసిన వైద్యులు టెక్కలి ఆసుపత్రికి రిఫర్ చేయగా... అక్కడి వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ప్రస్తుతం పవన్ పరిస్థితి విషమంగానే ఉన్నట్టు తెలుస్తోంది. చిన్న వయస్సులోనే ఏమైందో.. ఏమో ఆత్మహత్యా యత్నానికి పాల్పడడం ఈ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

## ఆపదలో ఉన్న మహిళల రక్షణకు శక్తి యాప్



**పలాస, జూన్ 16 (వార్త):** ఆపదలో ఉన్న మహిళల రక్షణకు శక్తి యాప్ ప్రయోజనకారి అని శక్తిటీం ఎస్ఐ ఎమ్.రవి అన్నారు. సోమవారం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు జరిగితే 112 నంబరుకు సంప్రదించాలన్నారు. ఒంటరి మహిళలకు, బాలికలకు శక్తి యాప్ రక్షాకవచంలా పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధి కూటమి ప్రభుత్వం లక్ష్యం

**పలాస, జూన్ 16 (వార్త):** విద్యాభివృద్ధి కూటమి ప్రభుత్వం లక్ష్యమని కిష్టిపురం ఎంపియుపి పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ రోజా అన్నారు. సోమవారం కిష్టపురం గ్రామంలో ఎంపియుపి స్కూల్‌లోయూనిట్ ఇంచార్జ్ బి.కృష్ణంరాజుతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగు, యూనిఫారాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యామంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. పిల్లలను పాఠశాల రప్పించేందుకు తల్లికి వందనం, యూనిఫారం తో పాటు విద్యార్థులకు కావలసిన సామగ్రిని అందజేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు డీవీఎస్ నారాయణ, సింహాచలం, గ్రామ పార్టీ అధ్యక్షులు తులసిరావు, ముకుందరావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి వనరులు అభివృద్ధి చేయాలి

**మందస, జూన్ 16(వార్త):** మందస మండలంలోని ఎంతో కాలంగా రైతులని వేధిస్తున్న సాగునీటి సమస్యలను పరిష్కరించాలని మహేంద్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. మందస మండలంలోని అన్ని గెడ్డలు పూర్తిగా పాడై పోయాయని, ఈ విషయమై అధికారులందరికీ పలుమార్లు తెలియపరచి, సమస్య పరిష్కరించమని గతంలో కోరామన్నారు. పంట పొలాలకు నీటి సరఫరా జరుగక పోవుట చేత రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళింగ్‌దళ్, డబారుసింగి రిజర్వాయర్ల మదుములు మరమ్మతులు చేయించాలని కోరారు. డిమిరియా వద్ద నుండి కొత్తపల్లి వరకు దేశిబట్టి లో ఉన్న పూడికను తొలగించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు, సంఘం నాయకులు కొర్ల హేమరావు చౌదరి, శిస్టు బాపూజీ, జగన్నాథ బెహరలతో పాటు చింతాడ చలపతిరావు, వాయిలపెల్లి మాధవరావు (ఎంపీటీసీ), పిడిమందస, కిల్లి ఆదినారాయణ, దొక్కరి నారాయణ, వాయలపెల్లి రమణ, ధర్మార్పు వెంకటరావు తదితరులు ఉన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 114 వినతులు

**శ్రీకాకుళం, జూన్ 16 (వార్త):** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శ్రీకాకుళంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, జడ్పి సీఈవో ఎల్.ఎన్.వి. శ్రీధర్ రాజా నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి హాజరైన ప్రజలు తమ సమస్యలపై మొత్తం 114 వినతులు అందజేశారు. వీటిలో భూమి సమస్యలు, పింఛన్లు, నివాస స్థలాలు, రేషన్ కార్డులు, మౌలిక వసతులపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అప్పగిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

### ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులు పరిష్కారానికి శ్రద్ధ వహించి ఆయా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి, చట్ట ప్రకారం పరిష్కరించాలని ఏఎస్పీ కె.వి.రమణ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార కార్యక్రమంలో 56 మంది నుంచి వినతులు స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడి ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. వృద్ధులు, వికలాంగుల అర్జీ దారులు వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఆయా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా, తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అదనపు ఎస్పీ కేవీ రమణ అధికారులను ఆదేశించారు.

## 14 వినతులు అందాయి: కమిషనర్

**పలాస, జూన్16(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 14 వినతులు వచ్చాయని మున్సిపల్ కమీషనర్ నడిపేనా రామారావు తెలిపారు అందులో తల్లికి వందనం పథకం పునరుద్ధరణకు నాలుగు, బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లకు ఐదు, పెన్షన్లకు రెండు, సిమెంట్ రోడ్డు కాలువల కోసం మూడు దరఖాస్తులు అందాయన్నారు.



# కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

* వ్యాపార సంస్థలుగా మారిన విద్యాసంస్థలు
* ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీహెచ్ రవి
* పలాసలో ధర్నా

**పలాస, జూన్ 16 (వార్త):** పలాసలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న జేవై, శ్రీ చైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయాలని, పుస్తకాల పేర్లతో వేల రూపాయలు వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల మీద చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జేవై విద్యాసంస్థలు, శ్రీ చైతన్య విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్నారు. విద్యను వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులను మోసం చేస్తూ ఐపీఎల్, ఎంపిఎల్ అంటూ మాటల చెబుతూ తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తూ అడ్మిషన్లు చేసుకుంటున్నారని, నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫారాలు అమ్ముతూ కాసులు కూడబెట్టుకుంటున్నారన్నారు. అలాగే ఫీజులు లక్షల్లో దోచేస్తున్నారన్నారు. విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు సమకూర్చడం లేదని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల వైపు విద్యాశాఖ అధికారులు కనీసం కన్నెత్తి చూడడం లేదని మండిపడ్డారు. కళాశాలకు ఆట స్థలం ఉండడం లేదని, ఫైర్ సేఫ్టీ పరికరాల ఊసే లేదన్నారు. జేవై, శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యా దోపిడీని అరికట్టకపోతే త్వరలోనే ఇంటర్మీడియట్ బోర్డు వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. అలాగే అనుమతులు లేకుండా నడుపుతున్నటువంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయి, సహాయ కార్యదర్శి గుణశేఖర్, నాయకులు విజయ్, చైతన్య, రమేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించడమే లక్ష్యం

* శ్రీవిద్యావాహిణి డిగ్రీ కళాశాల కళాశాల డైరెక్టర్ పైలా తిరుపతిరావు
* ఉద్యోగ మేళాలో 362 మంది ఎంపిక

**పలాస, జూన్ 16(వార్త):** నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించడం లక్ష్యం అని శ్రీవిద్యావాహిణి డిగ్రీ కళాశాల కళాశాల డైరెక్టర్ పైలా తిరుపతిరావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ శ్రీవిద్యావాహిణి డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. 13 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరయ్యి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 829 మంది హాజరుకాగా అందులో 362 మంది వివిధ కంపెనీలలో ఎంపికయ్యారు. కళాశాల కరస్పాండెంట్ పైల తిరుమలరావు మాట్లాడుతూ జాబ్ మేళాకి హాజరైన ప్రతి నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు. ఎక్కడ ఉద్యోగం వచ్చినా పనిచేయాలని, రానున్న రోజుల్లో సమీప బ్రాంచ్లకు బదిలీకావచ్చునని సూచించారు. అభ్యర్థులు కంపెనీల చుట్టూ ఉద్యోగాల కోసం తిరగకుండా కళాశాలలో ప్లేస్మెంట్ పొందడం సంతోషకరం అన్నారు. అమేజాన్కు 52, ప్రిమియర్ ఎనర్జీ 48, టెలీఫెర్మార్మెన్స్ 38, వివిధ బ్యాంకులకు 32, అపోలా పార్మశీ 25, మెడ్ ప్లస్ 14, హెచ్ఐహెచ్ఐర్ 32, డబ్లూన్ఎస్ 26మందితో పాటు మొత్తంగా 13 కంపెనీలకు 362 మందికి ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు, డైరెక్టర్లు పి సంధ్యారాణి, మన్మధరావు, ఏఓ ఖగేశ్వరరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## వెన్నుపోటు పుస్తకావిష్కరణ



**పలాస, జూన్ 16 (వార్త):** బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది పాలనలో ప్రజలకు వెన్నుపోటు పొడిచి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న చంద్రబాబు నాయుడు పాలనపై వెన్నుపోటు పుస్తకాన్ని సోమవారం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రగతిభవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బి.హేమేశ్వరరావు, బత్తిని లక్ష్మణ్, గుజ్జు జోగారావు, బమ్మిడి సంతోష్ కుమార్, ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

### తల్లికి వందనం..

# స్కీమా.. స్కామా?

*** అభివృద్ధి, అవినీతిపై చర్చకు సిద్ధం * తేదీ, సమయం చెబితే వస్తా * పలాస ఎమ్మెల్యేకు మతిభ్రమించినట్టుంది * మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు**




**పలాస, జూన్ 16 (వార్త):** రాష్ట్రంలో 14,500 పిల్లలు బడిబయట ఉన్నారని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెబుతున్నారని, వారు ఏమయ్యారనే దానిపై మంత్రి సమాధానం చెప్పాలని, అసలు తల్లికివందనం అనేది స్కీమా స్కామా అనేది అర్థం కావడం లేదని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ప్రగతిభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో 87 లక్షలు మంది పిల్లలు ఉండగా 2025-2026 సంవత్సరానికి 65 లక్షల మందికి పడిపోయాలరన్నారు. మిగిలిన 14 లక్షల మంది పిల్లలు బడికి కాకుండా పనికి వెళు తున్నారని, దీనికి కూటమి ప్రభుత్వమే కారణమన్నారు. ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు. 2018 -19 సంవత్సరం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 75 లక్షల మంది పిల్లలు ఉండగా ఆ సంఖ్య పెరగాల్సింది పోయి తగ్గిపోవడం ఏమిటని ప్రశ్నించారు. 2024-25లో అమ్మఒడి ఇచ్చి ఉంటే ఈ సమస్య రాకపోయేదని, మీ ప్రభుత్వం వచ్చాక ఏడాది అమ్మఒడి ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులకు స్థోమత లేక వనులకు పంపుతున్నారన్నారు. 42 లక్షల మంది తల్లులకు ఈ పథకం వర్తింపజేశామని చెబుతున్నారని, జగన్ హయాంలో కూడా 42 లక్షల మంది తల్లులకు ఈ పథకం వర్తించగా నేటి పరిస్థితి చూస్తుంటే ఒక పిల్లవాడికి చదువుకు పంపి, మరో పిల్లవాడికి వనులకు పంపుతున్నట్లు మంత్రి లోకేష్ మాటలు బట్టి అర్థమవుతుందని అన్నారు. జగన్ హయాంలో విద్య కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి కేరళ స్థాయికి దగ్గరలో విద్యను తీసుకువెళితే, కూటమి ప్రభుత్వంలో విద్యాదీవన, వసతి దీవన వంటి పథకాలు నిలిపివేసి తల్లిదండ్రులకు పిల్లలకు చదివించే ఆర్థిక బరోసా కల్పించలేకపోతున్నారన్నారు. 14,500 పిల్లలు బడిబయట ఎక్కడ ఉన్నారో గుర్తించి వారికి బడిలో చేర్పించి, వారికి తల్లికివందనం పథకం అందించేలా మంత్రి లోకేష్ బాధ్యత తీసుకోవాలన్నారు. వలాస నియోజకవర్గంలో గత 40 ఏళ్లలో మీరు, అయిదేళ్లలో నేను చేసిన అభివృద్ధికి బహిరంగ చర్చకు సిద్ధమా అని సీదిరి అప్పలరాజు ఎమ్మెల్యే శిరీషకు సవాల్ విసిరారు. తేదీ సమయం చెబితే నేను రావడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. మీ కుటుంబ సంపాదన అందరికి తెలిసిందేనన్నారు. వేల కోట్ల ఆస్తులు మీకు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ అల్లుడు ట్యాక్స్ అని పేరు పెట్టారన్నారు. సారాపై పది రూపాయలు పెంచి అవినీతికి పాల్పడిన మీరా నన్ను విమర్శించేది అని ప్రశ్నించారు. తాను కష్టపడి చదువుకొని మెడల్స్ తీసుకొని డాక్టర్ వృత్తి చేపట్టి సంపాదించుకున్నానన్నారు. తన అన్నయ్య ఆస్తులు అమ్మి పలాసలో భవనం కొనుగోలు చేసుకున్నాడన్నారు. వైద్యులు ఎవరూ ఆస్తులు సంపాదించు కోవడం లేదా అని ప్రశ్నించారు. శివాజి హయాంలో అభివృద్ధి జరిగి ఉంటే ఈ ప్రాంతంలో నక్సలిజం ఎందుకు పుట్టుకొస్తుందన్నారు. మళ్లి నక్సలిజం ప్రాంతంగా మార్చాలని చూస్తున్నారన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మతిభ్రమించి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు విమర్శించారు.

### అప్పుడు మామకు..

# ఇప్పుడు ప్రజలకు వెన్నుపోటు

*** ఏడాది కాలంలో బాబు హామీల బండారం బట్టబయలు * కూటమి ప్రభుత్వ దుర్మార్గ పాలన ప్రజలు గమనిస్తున్నారు * జగన్ ఉంటేనే బాగున్న అని ప్రజలే అనుకుంటున్నారు * రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపైనే దృష్టి పెడుతున్నారు * వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ * వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరణ**

**నరసన్నపేట, జూన్ 16 (వార్త):** పిల్లనిచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన ఘనత అప్పట్లో అయితే... ఇప్పుడు నేరుగా తనను ముఖ్యమంత్రి చేసిన ప్రజల్నే... వెన్నుపోటు పొడిచిన ఘనుడు చంద్రబాబు అని వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం నరసన్నపేట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలను నమ్మించి నట్టేట ముంచడంలో చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం పరమావధి కాదని... అమరావతిలో వారి ఆస్తులు కాపాడుకోవడమే ముఖ్యమని ఆయన విమర్శించారు. ప్రజలు ఈ విషయమంతా గమనిస్తున్నారని.. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం దుర్మార్గ పాలన ప్రజలకు అవగతమైందన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట నియోజకవర్గం యువ నాయకులు పోలాకి జడ్పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగి నాయుడు, వాన గోపి, జడ్పిటిసి చింతు రామారావు, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పొందర కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజాపూఅప్పన్న, సుడా మాజీ చైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్తా, తోపాటు నాలుగు మండలాల వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గాలు, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



### జర్నలిస్టుపై దాడికి

## ఏపీ మీడియా ఫెడరేషన్ ఖండన

**ఏడీపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు**

**శ్రీకాకుళం, జూన్ 16 (వార్త):** సీమాంధ్ర విజన్ సంపాదకులు పేడాడ హేమసుందర్ జరిగిన దాడిపై ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ తీవ్రంగా ఖండించింది. సోమవారం జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌లో సంబంధిత ఎలక్ట్రికల్ ఏడి చల్లా వెంకటేశ్వరరావుపై ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డోల శంకర్‌రావు, కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌లు అడిషనల్ ఎస్పీతో మాట్లాడారు. రోజురోజుకూ జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయన్నారు. వార్త కథనాలు ప్రచురిస్తే సుమారు 50 మందితో హేమసుందర్ ఇంటిపైకి దాడికి ఏడీ అనుచరులు తెగబడ్డారన్నారు. జిల్లా ఎలక్ట్రికల్ ఏడి చల్లా వెంకటేశ్వరరావుపై కేసును నమోదు చేయాలన్నారు. దాడికి సహకరించిన వారిపై కూడా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర బాధ్యులు డోల అప్పన్న, గణపతి, చింతాడ అప్పలనాయుడు, అద్దంకి సురేష్, ఆకుల మాధవ్, బొడ్డేపల్లి రాజేష్, వి.రాము, వెంకటేష్ తదితరులు ఉన్నారు.






## ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పని చేయాలి

**మందస, జూన్ 16(వార్త):** ఉపాధ్యాయులు తాము పనిచేసిన ప్రతీ స్కూల్‌లో చిత్తశుద్ధితో పని చేయాలని మందస మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల బదిలీలలో భాగంగా మందస మండలం నుండి పలువురు ఉపాధ్యాయులు బదిలీపై వేరే పాఠశాలలకు వెళున్న సందర్భంగా మందస మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మణరావు, బీఎస్ సాల్మన్(మండల విద్యా శాఖాధికారి-2) ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పాఠశాలకు వెళ్ళినా ఆయా పాఠశాలల్లో ఆదర్శ గురువులుగా నిలవాలని కోరారు. విద్యార్థులకు చేరువై, వారి తల్లిదండ్రుల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించాలన్నారు. కష్టపడి పని చేసి, ఎన్రోల్మెంట్ పెరగడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో పోటీ తత్వం పెంచాలని చెబుతూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించండి



**సరుబుజ్జిలి, జూన్ 16 (వార్త):** సరుబుజ్జిలి మండలంలో 21 పంచాయతీలు ఉండగా అందులో ఐదు గ్రామ పంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్ లేరని, తక్షణం ఆయా పోస్టులను భర్తీ చేయాలని మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు బద్రి రామారావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఇదే విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. విజయరాంపురం, గోనెపాడు, చిన్న కాగితాపల్లి, ఇసకలపాలెం, పాలవలస గ్రామ పంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్ కొరత వల్ల ఉపాధి పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. ఉపాధి పనులు పర్యవేక్షించే వారు కరువయ్యారన్నారు. ఈ పనులను ఎంపీడీవో ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తనిఖీలు చేయాల్సివుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడం, ఎంపీడీవో పట్టించుకోకపోవడంతో ఉపాధి పనుల్లో అక్రమాలు చోటుచేసు కుంటున్నాయని, కేంద్ర ప్రభుత్వ నిధులు పక్కదారి పడుతున్నాయన్నారు. తక్షణం దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని బద్రి రామారావు కోరుతున్నారు.

## బి.తోటూరు డీలర్ మృతి పట్ల సంతాపం



**ఇచ్ఛాపురం, జూన్ 16 (వార్త):** బి.తోటూరులో డీలర్ దక్కత వంప్రసాద్ మృతి చెందారు. తెలుగుదేశం నాయకులు ప్రసాద్ మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. మృతుని భార్య కమల, కుమారుడు, కుమార్తెలను ఓదార్చారు. మాజీ ఎంపిపి దక్కత డిల్లీరావు, డి.కామేశ్వరరావు, ఎస్.సహదేవ్, ఎల్.పద్మనాభం, బి.రాజేంద్రప్రసాద్, ప్రకాశ్, వి.ధర్మరాజు, శ్రీను పరామర్శించిన వారిలో ఉన్నారు.

### మత్స్యకార గ్రామాలకు

## బస్ సౌకర్యం కల్పించండి

**ఆర్టీసీ ఈడీని కోరిన శ్యాం ప్రసాద్ రెడ్డి**

**ఇచ్ఛాపురం, జూన్16 (వార్త):** కవిటి మండలం కపాసుకుద్ధి, కొత్త పాలెం, చిన్న కర్రివానిపాలెం, బట్టివానిపాలేం, పెద్దకర్రివానిపాలెం, ఇద్దివాని పాలెం, కళింగపట్నం, ఒంటూరు, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట ప్రాంతాల్లోని మత్స్యకార గ్రామాలను అనుసంధానం చేస్తూ బస్సు సదుపాయం కల్పించాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కోరారు. విశాఖపట్నంలోని కార్యాలయంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె ఎస్ బ్రహ్మానంద రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి రోడ్డు సదుపాయం ఉన్న అన్ని మత్స్యకార గ్రామాలను బస్ సౌకర్యం కల్పించేలా పరిశీలన చేయాలని శ్రీకాకుళం ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. వారిచ్చిన నివేదికల మేరకు బస్సు సదుపాయం కల్పిస్తామన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546